PRGI REGN NO: APTEL/26/A3695

నేటి మినిట్ టు మినిట్

తెలుగు దిన పత్రిక

NETI MINUTE TO MINUTE

TELUGU DAILY

సంపుటి: 01 సంచిక :155 ఎడిషన్ : అనంతపురము మరియు సత్యసాయి జిల్లా, తేది : శుక్రవారం -20 నవంబర్ 2026, పేజీలు -4 వెల 1/-

VOLUME:01 ISSUE:155 EDITION: ANANTHAPURAMU, SATHYA SAI DIST. DATE: FRIDAY 20 NOVEMBER 2026 PAGES: 04 RS:01/

భారత్ పేదరికాన్ని
జయించింది!

- 12 ఏళ్లలో పూర్తిగా మారిన ఆర్థిక వ్యవస్థ
- 13 ఏళ్లలో 50 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారు
- ఫిక్కీ వార్షిక సమావేశంలో ప్రధాని మోదీ



న్యూఢిల్లీ,నవంబర్ 19(నేటి మినిట్ టు మినిట్): భారత్ అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతోందని, అదే వేగంతో పేదరికాన్ని అధిగమిస్తోందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఫిక్కీ వార్షిక సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత 12 ఏళ్లలో దేశ ఆర్థిక వ్యవస్థలో గణనీయమైన మార్పులు వచ్చాయని పేర్కొన్నారు.గత ప్రభుత్వాలు పేదరిక నిర్మూలనలో విఫలమయ్యాయని విమర్శించారు. ఒకప్పుడు బలహీనమైన ఐదు ఆర్థిక వ్యవస్థల్లో భారత్ ఉండేదని, ప్రస్తుతం దేశ పురోగతికి ప్రపంచమే సాక్షిగా నిలుస్తోందన్నారు. పాత విధానాలు దేశాభివృద్ధిని అడ్డుకున్నాయని పేర్కొన్నారు.ప్రపంచ బ్యాంకు నివేదిక ప్రకారం

మిగతా2లో...



2లో

గోపాల్‌పూర్ వైపు
అక్వాన్ తుపాను

- తీవ్ర తుపానుగా బలపడిన వాయుగుండం
- గంటకు 110 కి.మీ. వేగంతో గాలులు వీచే అవకాశం
- ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశాకు వాతావరణ శాఖ హెచ్చరిక

అనుమతులు లేకుండా కొత్త ప్రాజెక్టులు
చేపట్టొద్దు!

కృష్ణా, గోదావరి జలాలపై కేంద్రం స్పష్టమైన ఆదేశాలు

కేఆర్ఎంబీ, జీఆర్ఎంబీ పరిశీలన తప్పనిసరి

అపెక్స్ కౌన్సిల్ ఆమోదం తర్వాతే పనులు చేపట్టాలి



2లో

జెడ్పీ పీఠాలపై
కూటమి ముద్ర

- అభ్యర్థుల పేర్లు ఖరారు
- 22 ఛైర్మన్ స్థానాలు టీడీపీకి..
- జనసేనకు 4, బీజేపీకి ఒక ఛైర్మన్ పదవి
- నేడు ఎన్నికలు

అమరావతి,నవంబర్ 19(నేటి మినిట్ టు మినిట్): రాష్ట్రంలో జిల్లా పరిషత్ ఛైర్మన్, వైస్‌ఛైర్మన్ పదవుల పంపిణీపై కూటమి పార్టీల కసరత్తు కొలిక్కి వచ్చింది. పలు దఫాలుగా జరిగిన చర్చల అనంతరం గురువారం అర్ధరాత్రి టీడీపీ తమ అభ్యర్థుల జాబితాను విడుదల చేసింది. కూటమి ఒప్పందంలో

మిగతా2లో...

భూమి కొరత జిల్లాలకు ప్రత్యేక ల్యాండ్ బ్యాంక్

- పరిశ్రమలకు భూముల సమీకరణపై సీఎం చంద్రబాబు ఆదేశాలు..
- విశాఖలో 'బే-టెక్ సిటీ' అభివృద్ధికి ప్రణాళిక



అమరావతి,నవంబర్ 19(నేటి మినిట్ టు మినిట్): రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన భూమి లభ్యత తక్కువగా ఉన్న నేపథ్యంలో ప్రత్యేక ల్యాండ్ బ్యాంక్ విధానాన్ని తీసుకురావాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారులను ఆదేశించారు. ఏపీఐఐసీతో సమన్వయం చేసుకుని భూములను గుర్తించి అందుబాటులో ఉంచాలని సూచించారు. గురువారం అమరావతి, విశాఖ, తిరుపతి

మిగతా2లో...

ఏపీకి నీళ్లిచ్చింది మీరే.. నిందలు
మాపైనా?

- కృష్ణా జలాల్లో తెలంగాణ వాటాను 299 టీఎంసీలకు పరిమితం చేసింది కేసీఆర్ ప్రభుత్వమేనని రేవంత్ విమర్శ.. ●రాయలసీమ ఎత్తిపోతల పథకానికి సహకరించిందంటూ ఆరోపణలు..
- సిద్దిపేట సభలో బీఆర్ఎస్‌పై సీఎం రేవంత్‌రెడ్డి ధ్వజం



సిద్దిపేట,నవంబర్ 19(నేటి మినిట్ టు మినిట్): కృష్ణా జలాల విషయంలో ఆంధ్రప్రదేశ్‌తో కుమ్మక్కైంది బీఆర్ఎస్ నేతలేనని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విమర్శించారు. కృష్ణా జలాల్లో తెలంగాణకు 299 టీఎంసీలు సరిపోతాయని కేసీఆర్, హరీశ్‌రావులు ఒప్పందంపై సంతకాలు చేయలేదా అని ప్రశ్నించారు. అప్పటి ఏపీ ముఖ్యమంత్రి జగన్‌ను ప్రగతిభవన్‌కు పిలిచి విందు ఇచ్చి, రాయలసీమ ఎత్తిపోతల పథకానికి సహకరించింది కేసీఆర్ కాదా అని నిలదీశారు. సిద్దిపేటలో ఇందిరమ్మ కుటుంబ బీమా పథకాన్ని ప్రారంభించిన అనంతరం జరిగిన బహిరంగ సభలో సీఎం మాట్లాడారు. 2015లో కేంద్ర మంత్రి ఉమాభారతి సమక్షంలో కేసీఆర్, హరీశ్‌రావు, చంద్రబాబు నాయుడు కృష్ణా జలాల్లో ఆంధ్రప్రదేశ్‌కు 512 టీఎంసీలు, తెలంగాణకు 299 టీఎంసీలుగా ఒప్పందం చేసుకున్నారని, 2022లోనూ దానిని కొనసాగించేలా అంగీకరించారని గుర్తుచేశారు. దీనిపై అసెంబ్లీలో చర్చకు సిద్ధమని ప్రకటించారు. పాలమూరుకు కృష్ణా జలాలు అందించడంలో బీఆర్ఎస్

మిగతా2లో...

ప్రపంచ శాంతికి అగ్రరాజ్యాలు
ఒక్కటవ్వాలి!

శాంతి, భద్రత పరిరక్షణ మనందరి బాధ్యత

రష్యా, చైనా, అమెరికా కలిసి పనిచేయాలి

అణ్వాయుధాల నిరాయుధీకరణపై చర్చలు

ఉక్రెయిన్ యుద్ధానికి పరిష్కారం దిశగా అడుగులు: జిన్‌పింగ్, పుతిన్, ట్రంప్



2లో



మూడో విడత పంచాయతీ
ఎన్నికలకు నగారా

25 జిల్లాల్లో ఎన్నికల నిర్వహణకు నోటిఫికేషన్ విడుదల చేసిన రాష్ట్ర ఎన్నికల సంఘం..

4,240 సర్పంచ్, 42,626 వార్డు స్థానాలకు ఎన్నికలు..

డిసెంబర్ 2న పోలింగ్, అదే రోజు ఓట్ల లెక్కింపు

అమరావతి,నవంబర్ 19(నేటి మినిట్ టు మినిట్): రాష్ట్రంలో మూడో విడత గ్రామ పంచాయతీ ఎన్నికలకు రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ విడతలో 25 జిల్లాల పరిధిలో 4,240 సర్పంచ్, 42,626 వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా

మిగతా2లో...

సమగ్ర కులగణనకు
వైఎస్సార్‌సీపీ మద్దతు

బీసీ, ఓబీసీలకు ప్రత్యేక కుల కాలమ్ ఉండాలి: వైఎస్ జగన్



అమరావతి,నవంబర్ 19(నేటి మినిట్ టు మినిట్): 2027 జనగణనలో సమగ్ర కులగణన చేపట్టాలనే డిమాండ్‌కు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. సామాజిక న్యాయం, సమాన అభివృద్ధికి కచ్చితమైన కులాల వారీ గణాంకాలు అవసరమని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆల్ ఇండియా కులగణన సమన్వయ కమిటీ ప్రతినిధులు తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో జగన్‌ను కలిసి తమ డిమాండ్లను వివరించారు. 2027 జనగణనలో బీసీ లేదా ఓబీసీలకు ప్రత్యేక కుల కాలమ్ ఏర్పాటు చేయాలని, ఏ కులమూ గణనలో మిగిలిపోకుండా సమగ్ర కులాల జాబితాతో కూడిన డ్రాప్‌డౌన్ విధానం తీసుకురావాలని కోరారు. ప్రతి కుటుంబ ఆర్థిక స్థితిగతులను

మిగతా2లో...

భూమి కొరత జిల్లాలకు ప్రత్యేక ల్యాండ్ బ్యాంక్

(మొదటి పేజీ తరువాయి)

ఆర్థిక ప్రాంతాల అభివృద్ధి ప్రణాళికలపై అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో భూముల కొరత ఉందని, ఇది పారిశ్రామిక అభివృద్ధికి ఆటంకంగా మారుతోందని పేర్కొన్నారు.రాష్ట్ర సమగ్రాభివృద్ధికి రూపొందించిన మూడు ఆర్థిక ప్రాంతాల ప్రణాళికలను సమర్థంగా అమలు చేయాలని, ఇప్పటికే గుర్తించిన పెట్టుబడులను కార్యరూపంలోకి తీసుకురావాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వ సిటీ ఎకనామిక్ రీజియన్ పథకం కింద రూ.9,180 కోట్లతో ప్రతిపాదించిన 60 ప్రాజెక్టులను త్వరితగతిన అమలు చేయాలని సూచించారు. పరిశ్రమల ద్వారా ప్రజల ఆదాయాలు పెరగడంతో పాటు జీవన ప్రమాణాలు మెరుగుపడాలని, ప్రాజెక్టుల అమలులో ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం ఉండాలని స్పష్టం చేశారు. **విశాఖలో బే-టెక్ సిటీ** విశాఖ ఆర్థిక ప్రాంతంలో భాగంగా యాంకర్ ప్రాజెక్టు కింద అభివృద్ధి చేస్తున్న ప్రాంతానికి 'విశాఖ బే-టెక్ సిటీ'గా పేరు పెట్టారు. సైబరాబాద్ తరహాలో విశాఖకు అనుబంధంగా ఈ నగరాన్ని అభివృద్ధి చేయాలని సీఎం సూచించారు. విజయనగరం, అనకాపల్లి ప్రాంతాల్లో ముందుగానే భూములను గుర్తించి ల్యాండ్ బ్యాంక్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. విశాఖలో ఏడాదిలోగా కన్వెన్షన్ సెంటర్ నిర్మాణం పూర్తి చేసి, తదుపరి సీఐఐ భాగస్వామ్య సదస్సును అక్కడే నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

తిరుపతికి సాంకేతిక పరిశ్రమల కేంద్రంగా గుర్తింపు

తిరుపతిని గ్లోబల్ సెమీకండక్టర్ డిజైన్ కేంద్రంగా తీర్చిదిద్దాలని చంద్రబాబు సూచించారు. ఎలక్ట్రానిక్స్, అంతరిక్ష పరిశోధన, రోబోటిక్స్, డ్రోన్ల రంగాల్లో పరిశోధన, అభివృద్ధి కేంద్రాలను ఏర్పాటు చేయాలని తెలిపారు. తిరుపతి ఆర్థిక ప్రాంతంలో రూ.9 లక్షల కోట్ల పెట్టుబడుల ప్రతిపాదనలు ఉండగా, వాటిలో రూ.5.70 లక్షల కోట్లు గ్రీన్ ఎనర్జీ రంగానికి సంబంధించినవని వివరించారు. ప్రధాన పరిశ్రమలతో పాటు వాటికి అనుబంధంగా సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలను అభివృద్ధి చేయాలని సూచించారు.**అమరావతిలో రూ.4.65 లక్షల కోట్ల ప్రాజెక్టులు** అమరావతి ఆర్థిక ప్రాంతంలో ఆక్వా, కోకో, పామాయిల్ రంగాలు కీలకంగా ఉన్నాయని సీఎం పేర్కొన్నారు. ఇప్పటికే రూ.4.65 లక్షల కోట్ల విలువైన 48 ప్రాజెక్టులు కొనసాగుతున్నాయని తెలిపారు. మచిలీపట్నం, రామాయపట్నం పోర్టులకు మెరుగైన రవాణా అనుసంధానం కల్పిస్తే ఈ ప్రాంతం వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. అమరావతిని క్వాంటం కారిడార్, క్వాంటం తయారీ కేంద్రంగా తీర్చిదిద్దాలని, ఇన్నర్, ఔటర్ రింగ్‌రోడ్లు అభివృద్ధికి కీలకంగా నిలుస్తాయని చెప్పారు.అలాగే అరకు, లంబసింగి పర్యాటక ప్రాంతాల్లో రహదారులు, వసతి సదుపాయాలు మెరుగుపరచాలని, సూర్యలంక, ఓడరేవు, చినగంజాం, నిజాంపట్నం, దిండి ప్రాంతాల్లో బీచ్, పర్యావరణ పర్యాటకానికి అవకాశాలను వినియోగించుకోవాలని సూచించారు. నాగార్జున కొండ, అమరావతిని అనుసంధానిస్తూ బౌద్ధ పర్యాటక మార్గాన్ని అభివృద్ధి చేయాలని ఆదేశించారు. సమావేశంలో మూడు ఆర్థిక ప్రాంతాల సీఈవోలు యువరాజ్, ముఖేష్‌కుమార్ మీనా, సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

జెడ్పీ పీఠాలపై కూటమి ముద్ర

(మొదటి పేజీ తరువాయి)

భాగంగా టీడీపీకి 22 ఛైర్మన్, 20 వైస్‌ఛైర్మన్ పదవులు, జనసేనకు నాలుగు ఛైర్మన్, ఐదు వైస్‌ఛైర్మన్ పదవులు, బీజేపీకి ఒక ఛైర్మన్, రెండు వైస్‌ఛైర్మన్ పదవులు కేటాయించినట్లు ప్రకటించింది. అర్ధరాత్రి వరకు జనసేన, బీజేపీ తమ అభ్యర్థుల పేర్లను వెల్లడించలేదు. శుక్రవారం ఛైర్మన్, వైస్‌ఛైర్మన్ ఎన్నికలు జరగనున్నాయి.టీడీపీ ప్రకటించిన జాబితా ప్రకారం శ్రీకాకుళం జిల్లా వైస్‌ఛైర్మన్‌గా గుంటు విజయ్‌కుమార్, విజయనగరం ఛైర్మన్‌గా మజ్జి సిరి సహస్ర, వైస్‌ఛైర్మన్‌గా పసల హోమ్మీరాజ, పార్వతీపురం మన్యం వైస్‌ఛైర్మన్‌గా వైరిచర్ల వీరేష్ చంద్రదేవ్, విశాఖపట్నం ఛైర్మన్‌గా గాడు అలివేణి, వైస్‌ఛైర్మన్‌గా సుగవాసి అజయ్, అనకాపల్లి వైస్‌ఛైర్మన్‌గా పెంటకోట స్వాతి ఎంపికయ్యారు. పోలవరం ఛైర్మన్‌గా వంతల రాజేశ్వరి, వైస్‌ఛైర్మన్‌గా తీగల ప్రభ, కాకినాడ వైస్‌ఛైర్మన్‌గా పిల్లి అనంతలక్ష్మి, తూర్పు గోదావరి ఛైర్మన్‌గా కాడ పద్మ, డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ ఛైర్మన్‌గా గొల్లపల్లి అమూల్య పేర్లను ప్రకటించారు.పశ్చిమ గోదావరి ఛైర్మన్‌గా ఇందుకూరి రామకృష్ణంరాజు, వైస్‌ఛైర్మన్‌గా సిరగాని నాగేశ్వరరావు, ఏలూరు ఛైర్మన్‌గా చింతమనేని సాయి నవ్యశ్రీ, వైస్‌ఛైర్మన్‌గా బొర్రా చలమయ్య, కృష్ణా వైస్‌ఛైర్మన్‌గా దండమూరి పూజిత, ఎన్టీఆర్ జిల్లా ఛైర్మన్‌గా కోట పుల్లమ్మ, గుంటూరు ఛైర్మన్‌గా ధార అరుణ, వైస్‌ఛైర్మన్‌గా తల్లా అశోక్‌కుమార్ ఎంపికయ్యారు. పల్నాడు ఛైర్మన్‌గా పుచ్చకాయల రుమాదేవి, వైస్‌ఛైర్మన్‌గా నలపాటి కిరణ్, బాపట్ల ఛైర్మన్‌గా పుషడపు రోహిణి, ప్రకాశం ఛైర్మన్‌గా కొక్కిలిగడ్డ ప్రభాకరరావు, మార్కాపురం ఛైర్మన్‌గా కందుల రామిరెడ్డి, వైస్‌ఛైర్మన్‌గా జి.వి. శ్రీనివాసవర్మ పేర్లను ఖరారు చేశారు.శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఛైర్మన్‌గా పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, వైస్‌ఛైర్మన్‌గా పొట్టెల్ల ప్రసాద్, కర్నూలు ఛైర్మన్‌గా చూడి ఉలిగయ్య, వైస్‌ఛైర్మన్‌గా షేక్ షాదిక, నంద్యాల ఛైర్మన్‌గా షేక్ బృహానుద్దీన్, వైస్‌ఛైర్మన్‌గా కె. శ్రీకాంత్‌రెడ్డి, అనంతపురం ఛైర్మన్‌గా గంజే నాగరాజు, వైస్‌ఛైర్మన్‌గా వెన్నపూస లలిత ఎంపికయ్యారు. శ్రీ సత్యసాయి జిల్లా ఛైర్మన్‌గా పరిటాల శ్రీరామ్, వైఎస్సార్ కడప ఛైర్మన్‌గా పుత్తా నరసింహారెడ్డి, వైస్‌ఛైర్మన్‌గా హబీబున్నీసా చాంద్‌బాయి, అన్నమయ్య ఛైర్మన్‌గా సుగవాసి ప్రసాద్‌బాబు, వైస్‌ఛైర్మన్‌గా తల్లారి శరణ్య, తిరుపతి ఛైర్మన్‌గా హేమలత, చిత్తూరు ఛైర్మన్‌గా మాదలం హేమశైలజ, వైస్‌ఛైర్మన్‌గా ఎస్. మంజుశ్రీ వెంకటేష్ పేర్లను టీడీపీ ప్రకటించింది.జనసేన, బీజేపీకి కేటాయించిన స్థానాల్లో అభ్యర్థుల పేర్లు ప్రకటించాల్సి ఉంది. నేడు జరిగే ఎన్నికలతో జిల్లా పరిషత్ పీఠాలపై తుది స్పష్టత రానుంది.

ప్రపంచ శాంతికి అగ్రరాజ్యాలు ఒక్కటవ్వాలి!

షెన్‌జెన్,నవంబర్ 19(నేటి మినిట్ టు మినిట్): ప్రపంచ శాంతి, భద్రతను కాపాడేందుకు కలిసి పనిచేయాల్సిన బాధ్యత ప్రధాన శక్తులైన అమెరికా, చైనా, రష్యాలపై ఉందని ఆ దేశాల అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్, షీ జిన్‌పింగ్, వ్లాదిమిర్ పుతిన్ పేర్కొన్నారు. గురువారం జరిగిన తొలి త్రైపాక్షిక సమావేశాన్ని చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ చారిత్రక మైలురాయిగా అభివర్ణించారు. ప్రపంచ సవాళ్లను ఎదుర్కోవడంలో మూడు దేశాలు పరస్పర సహకారంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.80 ఏళ్ల క్రితం రెండో ప్రపంచ యుద్ధ సమయంలో ఫాసిస్టు వ్యతిరేక కూటమిలో మూడు దేశాలు కలిసి పోరాడిన విషయాన్ని జిన్‌పింగ్ గుర్తుచేశారు. అప్పటి చారిత్రక అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకుని, ప్రపంచ శాంతి, స్థిరత్వం కోసం కృషి చేయాలని సూచించారు. మానవాళి పురోగతికి పరస్పర సహకారం అవసరమని పేర్కొన్నారు.**వివాదాలకు చర్చలే పరిష్కారం: ట్రంప్** ప్రపంచ సమస్యలపై చర్చల మార్గాలను తెరిచి ఉంచాల్సిన బాధ్యత ప్రధాన దేశాలపై ఉందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. విభేదాలున్న దేశాలు చర్చలకు దూరంగా ఉండటం వల్ల సమస్యలు పరిష్కారం కావని, ప్రత్యక్ష చర్చల ద్వారానే వివాదాలకు పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. అణ్వాయుధాల నిరాయుధీకరణపై సమావేశంలో చర్చించినట్లు వెల్లడించారు. అణ్వాయుధాలను వదులుకునేలా దేశాలను ఒప్పించడం కష్టమైన ప్రక్రియ అని తెలిపారు.రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి పరిష్కారం లభించే అవకాశాలున్నాయని ట్రంప్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఇరు దేశాలు యుద్ధానికి ముగింపు పలకాలని కోరుకుంటున్నాయని అన్నారు. మరింత సురక్షితమైన ప్రపంచ నిర్మాణం కోసం జిన్‌పింగ్, పుతిన్‌లతో కలిసి కొత్త మార్గాలను అన్వేషించడమే తన లక్ష్యమని తెలిపారు. అణ్వాయుధాల వ్యాప్తిని అడ్డుకోవడంలో మూడు దేశాల సహకారం కీలకమని పేర్కొన్నారు. **ఆర్థిక, ఇంధన భద్రతకు సహకారం అవసరం: పుతిన్** ఆర్థిక సంబంధాలు, ఆహార, ఇంధన భద్రత, ఉగ్రవాద వ్యతిరేక చర్యల్లో మూడు దేశాల మధ్య సహకారం అవసరమని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ అన్నారు. ఉక్రెయిన్ యుద్ధంతో పాటు ఇతర ప్రాంతీయ వివాదాల పరిష్కారంలోనూ మూడు దేశాలకు ఉమ్మడి ప్రయోజనాలు ఉన్నాయని తెలిపారు. మాస్కో, బీజింగ్, వాషింగ్టన్ మధ్య పరస్పర గౌరవం, సమతుల్య ప్రయోజనాలతో కూడిన సహకారం ప్రపంచ స్థిరత్వాన్ని బలోపేతం చేస్తుందని పేర్కొన్నారు. అంతర్జాతీయ ఉగ్రవాదం, సరిహద్దులు దాటిన వ్యవస్థీకృత నేరాలను ఎదుర్కోవడంలోనూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు.

పాఠశాలల్లో విద్యార్థుల భద్రతకు చర్యలు చేపట్టండి

- మరో ఘటన జరిగే వరకు వేచి చూడొద్దు.. ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

అమరావతి,నవంబర్ 19(నేటి మినిట్ టు మినిట్): పాఠశాలల్లో విద్యార్థుల భద్రత విషయంలో నిర్లక్ష్యం వహించరాదని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు స్పష్టం చేసింది. అనంతపురం జిల్లా రాప్తాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థినిపై ఎలక్ట్రానిక్ రంపంతో దాడి జరిగిన ఘటనను ప్రస్తావిస్తూ, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించింది. పిల్లలను పాఠశాలలకు పంపే తల్లిదండ్రుల ఆందోళనను అర్థం చేసుకోవాలని పేర్కొంది. విద్యార్థుల భద్రతకు సంబంధించి స్పష్టమైన మార్గదర్శకాలు రూపొందించి, వాటిని క్షేత్రస్థాయిలో అమలు చేయాలని సూచించింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లిసా గిల్, జస్టిస్ చల్లా గుణరంజన్‌తో కూడిన ధర్మాసనం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి



విచారణ నాటికి భద్రతా చర్యలపై నివేదిక సమర్పించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది.ప్రభుత్వ పాఠశాలలకు ప్రహరీ గోడలు నిర్మించడంతోపాటు ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో అగ్నిమాపక పరికరాలు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరుతూ కాకినాడకు చెందిన హెల్ప్ ది పీపుల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, మేనేజింగ్ ట్రస్టీ కీర్తినీడి అఖిల్ శ్రీ గురుతేజ దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యాలపై హైకోర్టు విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా రాప్తాడు ఘటనను ప్రస్తావించిన ధర్మాసనం, మరో ఘటన జరిగే వరకు అధికారులు ఎదురుచూడకూడదని స్పష్టం చేసింది.ప్రభుత్వ పాఠశాలల ప్రాంగణాలకు ప్రహరీ గోడల నిర్మాణానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, అవసరమైన నిధులు మంజూరు చేస్తున్నామని విద్యాశాఖ తరఫు ప్రభుత్వ న్యాయవాది గుర్రం రామచంద్రరావు ధర్మాసనానికి వివరించారు. ప్రైవేటు పాఠశాలల్లోనూ భద్రతా చర్యలు చేపడుతున్నారని తెలిపారు. కొన్ని ప్రైవేటు పాఠశాలల్లో తల్లిదండ్రుల పేర్లు ముందుగా నమోదు చేసుకుని, గుర్తింపు కార్డులు చూపించిన తర్వాతే లోపలికి అనుమతిస్తున్న విధానాన్ని ధర్మాసనం ప్రస్తావించింది. విద్యార్థుల భద్రతకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు కాగితాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో అమలవుతున్నాయో లేదో వివరాలతో నివేదిక ఇవ్వాలని ఆదేశిస్తూ విచారణను వాయిదా వేసింది.

భారత్ పేదరికాన్ని జయించింది!

(మొదటి పేజీ తరువాయి)

గత 13 ఏళ్లలో భారత్‌లో 50 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారని మోదీ తెలిపారు. ఇది తమ ప్రభుత్వ హయాంలో సాధ్యమైందని అన్నారు. వ్యాపారాలను ప్రోత్సహించేందుకు కార్పొరేట్ పన్నును 30 శాతం నుంచి 22 శాతానికి తగ్గించామని, రూ.12 లక్షల వరకు వార్షిక ఆదాయం ఉన్నవారికి పన్ను మినహాయింపు కల్పించామని వివరించారు.రాబోయే 20 ఏళ్లలో దీర్ఘకాలిక పెట్టుబడులకు 'ఇండియా ఫస్ట్' విధానాన్ని పునాదిగా చేసుకోవాలని పారిశ్రామికవేత్తలకు సూచించారు. వ్యవసాయం, అనుబంధ రంగాల్లో భారీగా పెట్టుబడులు పెట్టాలని పిలుపునిచ్చారు.

గోపాల్‌పూర్ వైపు అక్వాన్ తుపాను

అమరావతి,నవంబర్ 19(నేటి మినిట్ టు మినిట్): బంగాళాఖాతంలో ఏర్పడిన అక్వాన్ తీవ్ర తుపాను ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా తీరాల వైపు దూసుకొస్తోంది. నవంబర్ 20 మధ్యాహ్నం నర్సాపూర్ నుంచి పూరీ మధ్య గోపాల్‌పూర్ సమీపంలో తీరం దాటే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ వెల్లడించింది. తీరం దాటే సమయంలో గంటకు 90100 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉండగా, గాలుల వేగం అప్పుడప్పుడు 110 కిలోమీటర్ల వరకు చేరవచ్చని హెచ్చరించింది.తుపాను ప్రభావంతో ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలకు వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించింది. మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లవద్దని అధికారులు హెచ్చరించారు.తుపాను ముప్పు నేపథ్యంలో ఒడిశాలో ముందస్తు సహాయక చర్యలు చేపట్టారు. తీర ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. సహాయక బృందాలను సిద్ధం చేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అధికారులు సూచించే జాగ్రత్తలు పాటించాలని విపత్తు నిర్వహణ శాఖ కోరింది.

అనుమతులు లేకుండా కొత్త ప్రాజెక్టులు చేపట్టొద్దు!

అమరావతి,నవంబర్ 19(నేటి మినిట్ టు మినిట్): కృష్ణా, గోదావరి నదులపై కేంద్ర ప్రభుత్వ అనుమతులు లేకుండా కొత్త ప్రాజెక్టులు చేపట్టరాదని కేంద్ర జలశక్తి శాఖ స్పష్టం చేసింది. ప్రాజెక్టుల సమగ్ర నివేదికలను (డీపీఆర్) సంబంధిత నదీ యాజమాన్య బోర్డులకు సమర్పించి, వాటి పరిశీలన అనంతరం అపెక్స్ కౌన్సిల్ ఆమోదం పొందాలని సూచించింది.ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం-2014లోని నిబంధనల ప్రకారం రెండు రాష్ట్రాలు కొత్త ప్రాజెక్టులను చేపట్టే ముందు కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ), గోదావరి నదీ యాజమాన్య బోర్డు (జీఆర్ఎంబీ) పరిశీలన, సాంకేతిక అనుమతులు పొందాలి. అనంతరం అపెక్స్ కౌన్సిల్ ఆమోదం తప్పనిసరి.ఈ మేరకు 2020 అక్టోబర్ 6న జరిగిన అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో ఇరు రాష్ట్రాలు కొత్త ప్రాజెక్టుల డీపీఆర్‌లను బోర్డులకు సమర్పించాలని నిర్ణయించారు. అనుమతులు పొందే వరకు కృష్ణా, గోదావరి నదులపై కొత్త ప్రాజెక్టుల పనులు చేపట్టవద్దని కేంద్రం స్పష్టం చేసింది.

ఏపీకి నీళ్లిచ్చింది మీరే.. నిందలు మాపైనా?

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వం విఫలమైందని, ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు రూపురేఖలు మార్చి కాళేశ్వరం నిర్మాణానికి భారీగా ఖర్చు చేసి, మూడేళ్లకే ప్రాజెక్టు కూలిపోయిందని విమర్శించారు.బీఆర్ఎస్‌కు గతమే తప్ప భవిష్యత్తు లేదని, వచ్చే ఎన్నికల్లో సిద్దిపేటలో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని అన్నారు. కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపిస్తే మంత్రి పదవి ఇప్పిస్తానని ప్రకటించారు. బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రంపై రూ.8.11 లక్షల కోట్ల అప్పు భారం మోపారని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమంలో ప్రాణత్యాగం చేసిన కుటుంబాలకు తగిన గుర్తింపు ఇవ్వలేదని విమర్శించారు. సిద్దిపేట వైద్య కళాశాలకు మదన్‌మోహన్ పేరు పెట్టాలని ఆరోగ్యశాఖ మంత్రిని ఆదేశించినట్లు తెలిపారు. ఇందిరమ్మ బీమా పథకంతో ప్రతి కుటుంబానికి భరోసా కలుగుతుందని పేర్కొన్నారు.

మూడో విడత పంచాయతీ ఎన్నికలకు నగారా

(మొదటి పేజీ తరువాయి)

గురువారం షెడ్యూల్ ప్రకటించారు. డిసెంబర్ 2న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ నిర్వహించి, అదే రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు ప్రకటించనున్నారు.ఈ నెల 21 నుంచి 23వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరించనున్నారు. 21న ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు, 23న సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లు దాఖలు చేయవచ్చు. 24న ఉదయం 8 గంటల నుంచి నామినేషన్ల పరిశీలన చేపడతారు. 25న నామినేషన్ల తిరస్కరణపై అప్పీళ్ల స్వీకరణ, 26న వాటి పరిష్కారం ఉంటుంది. 27న మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఇచ్చారు. తుది అభ్యర్థుల జాబితా ప్రకటిస్తారు.ఈ విడతలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ, పార్వతీపురం మన్యం, తిరుపతి జిల్లాల్లో ఎన్నికలు నిర్వహించడం లేదు. మిగిలిన 25 జిల్లాల పరిధిలోని ఎంపిక చేసిన గ్రామ పంచాయతీల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఫలితాలు ప్రకటించిన రోజే ఉపసర్పంచ్ ఎన్నిక నిర్వహిస్తారు. అనివార్య కారణాలతో పోలింగ్ నిర్వహించలేని చోట్ల డిసెంబర్ 3న రీపోలింగ్ చేపట్టి, అదే రోజు ఓట్ల లెక్కింపు జరుపుతారు.**59 పదవులకు నేడు ఎన్నికలు** రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 34 ఎంపీపీ, 59 వైస్ ఎంపీపీ పదవులకు శుక్రవారం ఉదయం 11 గంటలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 659 మండల పరిషత్‌లకు గాను ఇప్పటివరకు 625 ఎంపీపీ, 600 వైస్ ఎంపీపీ పదవులకు ఎన్నికలు పూర్తయ్యాయని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ తెలిపారు. మిగిలిన పదవులకు ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

సమగ్ర కులగణనకు వైఎస్సార్‌సీపీ మద్దతు

(మొదటి పేజీ తరువాయి)

తెలియజేసే వివరాలను కూడా సేకరించాలని సూచించారు.ఈ సందర్భంగా జగన్ కులగణన డిమాండ్‌కు తమ పార్టీ మద్దతు ఉంటుందని తెలిపారు. బీసీ, ఓబీసీల రిజర్వేషన్ల హక్కుల పరిరక్షణకు సమగ్ర గణాంకాలు కీలకమని కమిటీ ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ నెల 28న న్యూఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో నిర్వహించనున్న 'చలో రామ్‌లీలా మైదాన్' నిరసన కార్యక్రమంలో పాల్గొనాలని జగన్‌ను ఆహ్వానించారు. ఈ సమావేశంలో ఢిల్లీ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ సూరజ్ మండల్, అఖిల భారత ఓబీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు డాక్టర్ గౌడ్ కిరణ్‌కుమార్, ఉమేష్ కుర్రం, డాక్టర్ పిట్టి మల్లికార్జున యాదవ్, ఇతర నాయకులతో పాటు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సమన్వయకర్త సజ్జల రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఓట్లప్పుడు కార్యకర్తలు..

పదవులప్పుడు పక్కన పెట్టేస్తారా...?

● శింగనమల నియోజకవర్గం ఎమ్మెల్యే బండారు శ్రావణి పై సొంత పార్టీ టీడీపీ కార్యకర్తలు, నేతలు సంచలన వ్యాఖ్యలు ● సింగనమల టీడీపీలో ఎంపీపీ పంచాయితీ...కార్యకర్తల కష్టానికి 'చివరి నిమిషం' షాక్ ● టికెట్ ఇచ్చింది ఒకరికి.. కుర్చీ కట్టబెట్టాలనుకుంటున్నది మరొకరికి ● రూ.30 లక్షల ఖర్చు.. నెలల తరబడి శ్రమ.. చివరకు మిగిలింది నిరసనలేనా? ● ఎమ్మెల్యే ఇంటి ముందు క్యాడర్ హంగామా...రాజీనామాల హెచ్చరిక






టీడీపీ కార్యకర్తలను పోలీసుల మధ్య తోపులాట



పెట్రోల్ పోసుకుంటున్న టీడీపీ కార్యకర్త



ఎమ్మెల్యే ఇంటి వద్ద మీడియా ముందు టీడీపీ నేతలు ఆవేదన చెప్పుకుంటున్న పరిస్థితి



పెట్రోల్ కంట్లో పడడంతో నడవలేకపోతున్న టీడీపీ కార్యకర్త



మీడియా ముందు వివరాలు వెల్లడిస్తున్న టీడీపి నేత



ఎమ్మెల్యే బండారు శ్రావణి గన్ మెన్ ఓవర్ యాక్షన్ మీడియా పైకి చేతులు చూపిస్తూ దాడికి ప్రయత్నం

శింగనమల,నవంబర్ 19(నేటి మినిట్ టు మినిట్): శింగనమల టీడీపీలో ఎంపీపీ పదవి ఇప్పుడు రాజకీయ రగడకు కేంద్రబిందువుగా మారింది. పార్టీ కోసం జెండాలు మోసిన కార్యకర్తలకు చివరకు మిగిలింది కన్నీళ్లా? గెలుపు కోసం ఖర్చు పెట్టిన నాయకులకు దక్కింది నిరాశేనా? అన్న ప్రశ్నలు పార్టీ శ్రేణుల్లో వినిపిస్తున్నాయి. ఎంపీపీ అభ్యర్థిగా ఒకరిని ఖరారు చేసి, చివరి నిమిషంలో మరొకరిని తెరపైకి తీసుకురావడంపై టీడీపీలో అసమ్మతి అగ్గిరాజేసింది. ప్రజల్లో పార్టీ పరువు నిలబెట్టాల్సిన నాయకులే కార్యకర్తల ముందు సమాధానం చెప్పుకోలేని పరిస్థితి ఏర్పడిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. **అభ్యర్థి ఎంపికలో మాట ఒకటి.. చేతల్లో మరొకటా?** మొదట్లో ఎంపీపీ పదవికి పోటీ చేసేందుకు ఎవరూ ముందుకు రాని పరిస్థితుల్లో సీనియర్ నాయకుడు, న్యాయవాది ఈశ్వర్‌రెడ్డి కోడలు పేట తులసిని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ అభ్యర్థిగా ఖరారు చేసినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. దీంతో తులసి గెలుపు కోసం ఈశ్వర్‌రెడ్డి వర్గం రంగంలోకి దిగింది. అయితే టీడీపీ, వైసీపీకి సమానంగా ఎంపీటీసీ స్థానాలు రావడంతో ఎంపీపీ పీఠం ఎవరిని వరిస్తుందన్న ఉత్కంఠ నెలకొంది. టాస్ వరకు వెళ్లే పరిస్థితి ఏర్పడింది. ఇంతవరకు అంతా బాగానే ఉన్నా.. చివరి నిమిషంలో కథ అడ్డం తిరిగిందని కార్యకర్తలు మండిపడుతున్నారు. పేట తులసిని పక్కనపెట్టి, నిధనవాడ ఎంపీటీసీ గొల్ల హరితను ఎంపీపీ అభ్యర్థిగా తెరపైకి తీసుకురావడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయన్న ప్రచారం పార్టీలో చిచ్చుపెట్టింది. అభ్యర్థిని నిర్ణయించేది నాయకత్వమా? లేక చివరి నిమిషంలో తెర వెనుక జరిగే రాజకీయాలా? అంటూ క్యాడర్ నిలదీస్తోంది. **రూ.30 లక్షలు ఖర్చు చేస్తే చివరకు మిగిలేది మొండిచేయేనా?** పేట తులసి అభ్యర్థిత్వం ఖరారైన తర్వాత ఆమె గెలుపు కోసం ఈశ్వర్‌రెడ్డి సుమారు రూ.30 లక్షలు ఖర్చు చేసినట్లు ఆయన వర్గీయులు చెబుతున్నారు. ఎన్నికల కోసం ఆర్థికంగా, రాజకీయంగా శ్రమించిన తమను చివరి నిమిషంలో పక్కనపెట్టడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. పార్టీ కోసం పెట్టిన ఖర్చుకు పదవి రూపంలో ప్రతిఫలం ఆశించకపోయినా, కనీసం ఇచ్చిన మాటకు విలువ ఉండాలిగా అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పార్టీ కోసం కష్టపడిన వారికి గుర్తింపు ఇవ్వకపోతే ఇక కార్యకర్తలు ఎందుకు పనిచేయాలన్న ప్రశ్న కూడా వినిపిస్తోంది. **ఎమ్మెల్యే ఇంటి ముందు క్యాడర్ కేకలు.. కారుకు అడ్డంగా నిరసనలు** అసమ్మతి ఇక గదుల్లో గుసగుసలకే పరిమితం కాలేదు. గురువారం అనంతపురంలోని ఎమ్మెల్యే కార్యాలయం, నివాసం వద్ద టీడీపీ కార్యకర్తలు నిరసనకు దిగినట్లు సమాచారం. ఎమ్మెల్యే వాహనాన్ని అడ్డుకుని తమ అసంతృప్తిని వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. పేట తులసికే ఎంపీపీ అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. పార్టీ కోసం ఇన్నాళ్లు పనిచేసిన తమకు న్యాయం జరగకపోతే రాజీనామాలకైనా సిద్ధమంటూ హెచ్చరించారు. పార్టీ కోసం జెండాలు మోసిన చేతులే ఇప్పుడు నిరసన ప్లకార్డులు పట్టాల్సిన పరిస్థితి రావడం నాయకత్వానికి హెచ్చరిక కాదా? కార్యకర్తల ఆగ్రహాన్ని చల్లార్చాల్సిన నాయకత్వమే వివాదానికి కేంద్రంగా మారిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. **ఇద్దరు ఎమ్మెల్యేల పేర్లు ప్రస్తావన.. తెర వెనుక అసలు కథేంటి?** ఈ వివాదంలో సింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీతో పాటు మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు పేర్లను కూడా కార్యకర్తలు ప్రస్తావిస్తూ విమర్శలు గుప్పిస్తున్నారు. స్థానిక నాయకులతో కలిసి ప్రత్యామ్నాయ అభ్యర్థికి మద్దతు కూడగట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపిస్తున్నారు. వైసీపీ నాయకులతో అంతర్గత అవగాహన కుదుర్చుకుని టీడీపీ క్యాడర్‌కు అన్యాయం చేస్తున్నారంటూ నిరసనకారులు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. వైసీపీ నేతల నుంచి డబ్బులు తీసుకుని నిర్ణయాలు మార్చారన్న ఆరోపణలు కూడా నిరసనల్లో వినిపించినట్లు సమాచారం. అయితే ఈ ఆరోపణలకు స్వతంత్ర నిర్ధారణ లేదు. సంబంధిత నాయకుల వివరణ, పార్టీ అధిష్ఠానం విచారణ తర్వాతే వాస్తవాలు వెలుగులోకి రావాల్సి ఉంది. **ఫోన్‌కాల్ డేటా బయటపెట్టాలట.. అనుమానాల మంటలు** ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త సాకే శైలజానాథ్ మధ్య రాజకీయ అవగాహన ఉందన్న అనుమానాలను కార్యకర్తలు వ్యక్తం చేస్తున్నారు. వీరిద్దరి మధ్య జరిగిన ఫోన్ సంభాషణలతో పాటు సంబంధిత నాయకుల కమ్యూనికేషన్‌పై పార్టీ అధిష్ఠానం విచారణ జరపాలని డిమాండ్ చేస్తున్నారు. అయితే ఫోన్‌కాల్ వివరాలు మాత్రమే రాజకీయ ఒప్పందానికి ఆధారం కాలేవు. ఆరోపణలపై సమగ్ర విచారణ జరగాల్సిన అవసరం ఉంది. **ప్రచారానికి దూరం.. పదవి విషయంలో మాత్రం జోక్యం?** ఎంపీటీసీ ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే ఒక్కరోజు కూడా పాల్గొనలేదని, అభ్యర్థులకు ఆర్థికంగా సహకరించిన దాఖలాలు కూడా లేవని కార్యకర్తలు ఆరోపిస్తున్నారు. ఎన్నికల సమయంలో కనిపించని నాయకత్వం ఎంపీపీ పీఠం దగ్గరకు వచ్చేసరికి ఎందుకు ఇంత చురుగ్గా మారిందని ప్రశ్నిస్తున్నారు. ఎన్నికల కష్టాలు కార్యకర్తలవే.. పదవుల నిర్ణయాలు మాత్రం నాయకులవేనా? అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధిస్తున్నారు. **అధిష్ఠానం జోక్యం చేసుకోకపోతే సింగనమలలో పార్టీకి గండమేనా?** ఈశ్వర్‌రెడ్డికి ఎంపీపీ అభ్యర్థిత్వం కేటాయించాలని ఏడీసీసీ చైర్మన్ కేశవరెడ్డి, నియోజకవర్గ పరిశీలకుడు ధర్మవరం సుబ్బారెడ్డి సూచించినప్పటికీ ఎమ్మెల్యే అంగీకరించలేదని కార్యకర్తలు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో పార్టీ పెద్దలు జోక్యం చేసుకుని వివాదానికి ముగింపు పలకాలని కోరుతున్నారు. ఒక ఎంపీపీ కుర్చీ కోసం మొదలైన పంచాయితీ ఇప్పుడు పార్టీ ప్రతిష్ఠకు పరీక్షగా మారింది. కార్యకర్తల శ్రమకు విలువ లేకపోతే పార్టీకి కేడర్ ఎందుకు? ఇచ్చిన మాటకు గౌరవం లేకపోతే నాయకత్వంపై నమ్మకం ఎలా? అన్న ప్రశ్నలు సింగనమల టీడీపీలో చర్చనీయాంశంగా మారాయి. శింగనమల నియోజకవర్గంలో ఇసుక రాజకీయం రోజురోజుకూ వేడెక్కుతోంది. ఇసుక వ్యాపారం చుట్టూ రాజకీయ ఒత్తిళ్లు, పోలీస్ స్టేషన్ల చుట్టూ వాహనాల చక్కర్లు, నాయకుల మధ్య ఆధిపత్య పోరు.. వెరసి నియోజకవర్గంలో కొత్త చర్చకు తెరలేపుతున్నాయి. ఎవరి మాట వినకపోతే ఇసుక వాహనాలు నేరుగా పోలీస్ స్టేషన్లకు చేరుతున్నాయంటూ వ్యాపార వర్గాల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇసుక లోడుతో వెళ్లే వాహనాలు ఒక్కసారిగా స్టేషన్లలో నిలిచిపోవడం వెనుక అసలు కథ ఏమిటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. నిబంధనల ఉల్లంఘన జరిగితే చర్యలు తీసుకోవడం సహజమే అయినా, ఎవరి మాట వినకపోతేనే వాహనాలు స్టేషన్ బాట పడుతున్నాయన్న ప్రచారం మాత్రం అనేక అనుమానాలకు తావిస్తోంది. ఇసుక రవాణాపై నిబంధనలు అందరికీ ఒకేలా అమలవుతున్నాయా? లేక రాజకీయ పలుకుబడిని బట్టి పరిస్థితులు మారుతున్నాయా? అన్న చర్చ ప్రజల్లోనూ సాగుతోంది. **ఇసుక వ్యాపారమా.. రాజకీయ చదరంగమా?** సింగనమలలో ఇసుక రవాణా వ్యవహారం వ్యాపారులకే కాదు, సామాన్య ప్రజలకు కూడా ఆశ్చర్యం కలిగిస్తోంది. ఇసుక వాహనాలు ఎప్పుడు బయలుదేరతాయో కంటే ఎప్పుడు పోలీస్ స్టేషన్‌కు చేరతాయోనన్న ఆందోళన వ్యాపారుల్లో నెలకొన్నట్లు తెలుస్తోంది. వ్యాపార వర్గాల్లో వినిపిస్తున్న ఆరోపణలు నిజమైతే ఇసుక రవాణా కంటే రాజకీయ అనుమతులే ముఖ్యమన్న పరిస్థితి ఏర్పడినట్లేనా? ప్రభుత్వ నిబంధనల కంటే నాయకుల మాటకే ప్రాధాన్యత పెరుగుతోందా? అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలపై అధికారిక వివరణ రావాల్సి ఉంది. **పెట్రోల్ పోసుకున్న కార్యకర్త.. పట్టించుకోని నాయకత్వం** ఒకవైపు ఇసుక వ్యవహారంపై రాజకీయ రగడ నడుస్తుండగా, మరోవైపు సొంత పార్టీ కార్యకర్తల అసంతృప్తి తీవ్ర రూపం దాల్చుతోంది. తమకు అన్యాయం జరుగుతోందంటూ ఓ టీడీపీ కార్యకర్త ఏకంగా పెట్రోల్ పోసుకుని నిరసన వ్యక్తం చేసిన ఘటన రాజకీయంగా చర్చనీయాంశమైంది. కార్యకర్త ఆ స్థాయికి వెళ్లే పరిస్థితి ఎందుకు వచ్చిందన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పార్టీ కోసం పనిచేసిన వ్యక్తి ఆవేదనను పట్టించుకుని సమస్య పరిష్కరించాల్సిన నాయకత్వం స్పందించిందా? లేక రాజకీయ కార్యక్రమాలకే ప్రాధాన్యత ఇచ్చిందా? అన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కార్యకర్తల సమస్యలు పరిష్కరించలేని నాయకత్వం, వారి ఆగ్రహాన్ని ఎలా చల్లారుస్తుందన్న చర్చ పార్టీ శ్రేణుల్లో సాగుతోంది. **పెట్రోల్ నిరసన కనిపించలేదా.. రాజకీయ కార్యక్రమాలే కనిపించాయా?** సొంత పార్టీ కార్యకర్త పెట్రోల్ పోసుకుని నిరసనకు దిగినంత తీవ్రమైన పరిస్థితి ఏర్పడినా ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ స్పందనపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కార్యకర్తల ఆవేదనను పక్కనపెట్టి రాజకీయ వ్యవహారాలకే ప్రాధాన్యత ఇస్తున్నారన్న అసంతృప్తి వినిపిస్తోంది. కార్యకర్తలకు కష్టం వచ్చినప్పుడు అందుబాటులో ఉండాల్సిన నాయకత్వం, పదవులు మరియు రాజకీయ కార్యక్రమాల దగ్గరే కనిపిస్తే పార్టీని నమ్ముకున్న వారి పరిస్థితి ఏమిటి? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అయితే ఎమ్మెల్యే స్పందన, ఆమె వివరణ కూడా వెలుగులోకి రావాల్సి ఉంది. **ఏకంగా మీడియాకే వార్నింగ్..?** ఇక సింగనమల ఎమ్మెల్యే వ్యవహారశైలిపై మీడియా వర్గాల్లోనూ చర్చ జరుగుతోంది. తనకు నచ్చిన మీడియా సంస్థలే కార్యక్రమాలకు రావాలన్న ధోరణి కనిపిస్తోందని, ప్రశ్నించే మీడియాపై అసహనం వ్యక్తం చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రజా ప్రతినిధుల కార్యక్రమాలను ప్రజలకు చేరవేసే బాధ్యత మీడియాదే. అయితే ఏ మీడియా రావాలి? ఏ మీడియా వార్త రాయాలి? ఏ వార్త ప్రసారం కావాలి? అన్నది కూడా నాయకులే నిర్ణయించాలనుకుంటే ప్రజాస్వామ్యంలో మీడియా స్వేచ్ఛకు చోటెక్కడ? అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. నచ్చిన వార్తలే ప్రచురించాలంటే సొంత మీడియా ఏర్పాటు చేసుకుంటే సరిపోతుందన్న వ్యంగ్య వ్యాఖ్యలు కూడా వినిపిస్తున్నాయి. విమర్శలను ఎదుర్కొనే ధైర్యం నాయకత్వానికి ఉండాలి కానీ, ప్రశ్నించే గొంతులను హెచ్చరికలతో మౌనం చేయాలనుకోవడం ఎంతవరకు సమంజసమన్న చర్చ సాగుతోంది. **ఇసుక నుంచి మీడియా వరకు.. సింగనమలలో చర్చలే చర్చలు** ఒకవైపు ఇసుక వాహనాల వ్యవహారంపై వ్యాపార వర్గాల్లో అనుమానాలు, మరోవైపు సొంత పార్టీ కార్యకర్త పెట్రోల్ నిరసన, ఇంకోవైపు మీడియా స్వేచ్ఛపై వివాదం.. ఇలా సింగనమల రాజకీయాలు ఒక్కొక్కటిగా కొత్త మలుపులు తిరుగుతున్నాయి. ప్రజల సమస్యలకు పరిష్కారం చూపాల్సిన నాయకత్వం చుట్టూ ఇన్ని వివాదాలు ఎందుకు చుట్టుముడుతున్నాయి? కార్యకర్తల ఆవేదనకు స్పందన ఎప్పుడు? ఇసుక రవాణాపై ఆరోపణలకు సమాధానం ఎప్పుడు? మీడియా ప్రశ్నలకు వివరణ ఎప్పుడు? అన్న ప్రశ్నలు నియోజకవర్గ ప్రజల్లో వినిపిస్తున్నాయి. మొత్తానికి సింగనమలలో ఇసుక రాజకీయాలు, కార్యకర్తల అసంతృప్తి, మీడియా వివాదం కలిసి రాజకీయ వేడిని పెంచుతున్నాయి. ఈ ఆరోపణలపై ఎమ్మెల్యే, సంబంధిత అధికారులు స్పందించి వాస్తవాలను వెల్లడిస్తారా? లేక విమర్శలు మరింత ముదిరే వరకు మౌనమే సమాధానంగా ఉంటుందా? అన్నది వేచి చూడాలి. శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ గన్‌మెన్ వ్యవహారశైలి ఇప్పుడు తీవ్ర వివాదానికి దారితీస్తోంది. ప్రజాప్రతినిధికి భద్రత కల్పించాల్సిన గన్‌మెన్.. మీడియాపై ప్రతాపం చూపించేందుకు ప్రయత్నించారన్న ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. వార్తలు సేకరించేందుకు వచ్చిన మీడియా ప్రతినిధులపై దురుసుగా వ్యవహరించడమే కాకుండా, ఏకంగా కెమెరాలు, మొబైల్ ఫోన్లు లాక్కునేందుకు యత్నిస్తూ దాడికి దిగే పరిస్థితి సృష్టించారని జర్నలిస్టులు ఆరోపిస్తున్నారు. విధి నిర్వహణలో ఉన్న మీడియా ప్రతినిధులతో సంయమనంగా వ్యవహరించాల్సిన బాధ్యత మరిచి, బెదిరింపులకు దిగడం ఏమిటన్న ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. **మీడియాపై గన్‌మెన్ పెత్తనమా.. ఇదేం ఓవరాక్షన్** మీడియా ప్రతినిధులను ఉద్దేశించి "ఎవరికి చెప్పుకుంటావో చెప్పుకోపో.. ఏం పీక్కుంటావో పీక్కోపో" అంటూ అసభ్య పదజాలంతో మాట్లాడినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అంతటితో ఆగకుండా కెమెరాలు, మొబైల్ ఫోన్లు లాక్కునే ప్రయత్నం చేయడం, జర్నలిస్టులపై దాడికి యత్నించడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. ప్రజల తరఫున ప్రశ్నలు అడిగే మీడియాపై ఇంతటి దురుసు ప్రవర్తన ఎందుకు? గన్‌మెన్‌కు భద్రతా విధులే అప్పగించారా? లేక మీడియాను నియంత్రించే బాధ్యత కూడా ఇచ్చారా? అన్న వ్యంగ్య ప్రశ్నలు వినిపిస్తున్నాయి. **టీడీపీ కార్యకర్తలే మీడియాకు రక్షణగా నిలిచారా?** ఈ ఘటనలో మరింత ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే.. గన్‌మెన్ తీరును అడ్డుకునేందుకు చివరకు టీడీపీ కార్యకర్తలే ముందుకు రావాల్సిన పరిస్థితి ఏర్పడిందని సమాచారం. మీడియా ప్రతినిధులకు అండగా నిలిచి, గన్‌మెన్ దురుసు ప్రవర్తనను అడ్డుకునేందుకు కార్యకర్తలు ప్రయత్నించినట్లు తెలుస్తోంది. సొంత పార్టీ కార్యకర్తలే మీడియాను కాపాడాల్సిన పరిస్థితి రావడం ఎమ్మెల్యే వర్గానికి ఇబ్బందికరంగా మారింది. ప్రజాప్రతినిధి చుట్టూ ఉండే భద్రతా సిబ్బంది వ్యవహారశైలి పార్టీ ప్రతిష్ఠకే భంగం కలిగించేలా ఉంటే బాధ్యత ఎవరిది? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.**గన్‌మెన్‌పై చర్యలు తీసుకునేదెవరు?** మీడియా స్వేచ్ఛను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంతో పాటు పోలీసు శాఖపైనా ఉంది. విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్టుల కెమెరాలు, మొబైల్ ఫోన్లు లాక్కునే ప్రయత్నం జరిగిందన్న ఆరోపణలు నిజమైతే అది తీవ్రంగా పరిగణించాల్సిన అంశం. గన్‌మెన్ ఎవరి ఆదేశాలతో ఇలాంటి వ్యవహారశైలికి దిగారు? మీడియాపై దురుసుగా ప్రవర్తించడానికి ఆయనకు అధికారం ఎవరిచ్చారు? అన్న ప్రశ్నలకు సమాధానం రావాల్సి ఉంది. సంబంధిత గన్‌మెన్‌పై సమగ్ర విచారణ జరిపి, తప్పు నిర్ధారణ అయితే కఠిన చర్యలు తీసుకోవాలని జర్నలిస్టు వర్గాలు డిమాండ్ చేస్తున్నాయి.**ప్రశ్నిస్తే బెదిరింపులా.. వార్త రాస్తే దౌర్జన్యమా?** ప్రజాస్వామ్యంలో మీడియా పాత్రను గుర్తించాల్సిన ప్రజాప్రతినిధుల చుట్టూ ఇలాంటి వివాదాలు చోటుచేసుకోవడం ఆందోళన కలిగిస్తోంది. నచ్చిన వార్తలే రావాలనుకోవడం, ప్రశ్నించే మీడియాను అడ్డుకోవడం, కెమెరాలు లాక్కునే ప్రయత్నాలు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గన్‌మెన్ బాధ్యత ప్రజాప్రతినిధికి రక్షణ కల్పించడమే తప్ప, మీడియాను బెదిరించడం కాదని జర్నలిస్టులు స్పష్టం చేస్తున్నారు.మొత్తానికి సింగనమలలో రాజకీయ వివాదాలకు తోడు ఇప్పుడు గన్‌మెన్ వ్యవహారశైలి మరో వివాదానికి కేంద్రంగా మారింది. మీడియాపై దురుసుగా ప్రవర్తించినట్లు వస్తున్న ఆరోపణలపై ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ స్పందిస్తారా? పోలీసు ఉన్నతాధికారులు విచారణకు ఆదేశిస్తారా? లేక గన్‌మెన్ ఓవరాక్షన్‌ను చూసీచూడనట్లు వదిలేస్తారా? అన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.మొత్తానికి ఎంపీపీ పీఠం ఇంకా ఎవరి సొంతమవుతుందో తెలియదు కానీ, ఈ వ్యవహారం మాత్రం టీడీపీలో వర్గపోరుకు వేదికైంది. అధిష్ఠానం జోక్యం చేసుకుని కార్యకర్తల అసంతృప్తిని చల్లారుస్తుందా? లేక ఎంపీపీ కుర్చీ కోసం మొదలైన పంచాయితీ పార్టీ పునాదులనే కదిలిస్తుందా? అన్నది వేచి చూడాలి.

యువత సృజనాత్మక శక్తికి కళలే అసలైన వేదికలు

● ఏఎన్ఎస్ఈటీ సీఈఓ ఎన్. రవిశంకర్ రెడ్డి





అనంతపురం, నవంబర్ 19(నేటి మినిట్ టు మినిట్): యువతలోని సృజనాత్మక ప్రతిభను వెలికితీసేందుకు కళలు చక్కని వేదికలుగా నిలుస్తాయని ఏఎన్ఎస్ఈటీ సీఈఓ ఎన్. రవిశంకర్ రెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల డ్రామా హాల్‌లో జిల్లా యువజన శాఖ (ఏఎన్ఎస్ఈటీ), ఎస్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా స్థాయి యువజనోత్సవం నిర్వహించారు.ఈ సందర్భంగా నాటకం, నృత్యం, చిత్రలేఖనం, కవిత్వ పఠనం తదితర విభాగాల్లో పోటీలు నిర్వహించగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. విజేతలకు ఇండియన్ రెడ్‌క్రాస్ మేనేజింగ్ కమిటీ సభ్యుడు దాసరి భరత్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, సృజనాత్మక ఆలోచనా విధానం, కళల పట్ల ఆసక్తిని పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని నిర్వాహకులు తెలిపారు.కార్యక్రమంలో ఇండియన్ రెడ్‌క్రాస్ వైస్ చైర్‌పర్సన్ గీతా బాల, ఆర్ట్స్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ కేశవ్, జేఎన్టీయూ ప్రొఫెసర్ డాక్టర్ రాధా కళ్యాణి, ఏఓ బాలాజీ నాయక్, ఎస్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు సుంకర రమేష్, రాయల్ రంగా, బిసాతి జీవన్ కుమార్, ఏఎన్ఎస్ఈటీ మేనేజర్ చిగిచెర్ల శ్రీనివాసులు, కళాశాల బోధన సిబ్బంది పాల్గొన్నారు.

ఏకగ్రీవం కోసం రాజకీయ దౌర్జన్యమా? నామినేషన్లకు అడ్డంకులు సృష్టిస్తున్నారనే ఆరోపణలు





శింగనమల,నవంబర్ 19(నేటి మినిట్ టు మినిట్): నాయనవారిపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని రాచేపల్లి వద్ద నామినేషన్ వివాదం రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది. ఏకగ్రీవం సాధించాలనే ఉద్దేశంతో టీడీపీ శింగనమల మాజీ మండల కన్వీనర్ గుత్తా ఆదినారాయణ ఇతర అభ్యర్థుల నామినేషన్లకు అడ్డంకులు సృష్టిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. టీడీపీ రెబల్ అభ్యర్థి బాయినేని నాయుడుతో పాటు వైసీపీ, స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయకుండా అడ్డుకున్నట్లు సమాచారం.**పోటీకి భయపడే అడ్డంకులా? ప్రజాస్వామ్య హక్కులకు సంకెళ్లా?** ఎన్నికల్లో గెలుపోటములు ప్రజల తీర్పుపై ఆధారపడి ఉండాలి తప్ప, ప్రత్యర్థులను నామినేషన్లు వేయకుండా అడ్డుకోవడం ద్వారా ఏకగ్రీవం సాధించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పోటీ చేయాలనుకునే ప్రతి అభ్యర్థికి నామినేషన్ దాఖలు చేసే స్వేచ్ఛ, హక్కు కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. ఈ ఘటనపై ఎన్నికల అధికారులు స్పందించి, నామినేషన్ల ప్రక్రియకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. అయితే ఈ ఆరోపణలపై సంబంధిత వ్యక్తుల వివరణ తెలియాల్సి ఉంది.

రాప్తాడు హైవేపై ఘోర రోడ్డు ప్రమాదం.. విద్యార్థి మృతి

- ఒకే బైక్‌పై ముగ్గురు విద్యార్థుల ప్రయాణం.. మరో ఇద్దరికి స్వల్ప గాయాలు



అనంతపురం,నవంబర్ 19(నేటి మినిట్ టు మినిట్):రాప్తాడు హైవేపై జరిగిన రోడ్డు ప్రమాదంలో జీవన్ సాయి అనే ఇంటర్ విద్యార్థి మృతి చెందగా, మరో ఇద్దరు విద్యార్థులు స్వల్పంగా గాయపడ్డారు. ఒకే ద్విచక్ర వాహనంపై ముగ్గురు విద్యార్థులు ప్రయాణిస్తుండగా బైక్ అదుపుతప్పి బోల్తా పడటంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. మృతుడు జీవన్ సాయితో పాటు గాయపడిన విద్యార్థులు అనంతపురం నగరంలోని ఎస్ఎస్‌బీఎన్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నట్లు సమాచారం. ఈ ఘటనతో విద్యార్థుల కుటుంబాల్లో విషాదం నెలకొంది.

లింగాల మండల ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటా...

నూతన మండలాధ్యక్షుడు దేవిరెడ్డి సంజీవరెడ్డి

లింగాల నవంబర్ 19(నేటి మినిట్ టు మినిట్): మండల పరిధిలోని ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి వారి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని నూతనంగా ఎన్నికైన లింగాల మండలాధ్యక్షుడు దేవిరెడ్డి సంజీవరెడ్డి అన్నారు. ఈ నెల మూడో తేదీ జరిగిన మండల పరిషత్ ఎన్నికల్లో మండల పరిధిలోని 9 ఎంపీటీసీ స్థానాల్లో టిడిపి 8 బీజేపీ ఒకటి మొత్తం 9ఎంపీటీసీ స్థానాలను ఏకగ్రీవంగా కూటమి పార్టీలు విజయం సాధించాయి. ఇందులో భాగంగా గురువారం ఉదయం లింగాల మండల అధ్యక్షునిగా దేవిరెడ్డి సంజీవరెడ్డిని 8 మంది ఎంపీటీసీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల ఎన్నికల అధికారిణి సుహాసిని లింగాల మండలాధ్యక్షుడుగా సంజీవరెడ్డిని ప్రకటిస్తూ డిక్లరేషన్



ఫారం అందజేశారు.అనంతరం మండలాధ్యక్షుడు సంజీవరెడ్డి మాట్లాడుతూ మండల ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు తాను ఎల్లవేళలా అందుబాటులో ఉంటానన్నారు. మండల పరిధిలోని అధికారులు కూడా తమ కార్యాలయాలకు వచ్చే ప్రజల సమస్యలను తెలుసుకొని వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, రాష్ట్ర మంత్రి లోకేష్ బాబు, ఈ పదవి వచ్చేందుకు కృషిచేసిన పులివెందుల నియోజకవర్గ టిడిపి ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవికి సంజీవరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. కో ఆప్షన్ సభ్యులను త్వరలో ఎన్నుకోనున్నట్లు సంజీవరెడ్డి తెలిపారు. అనంతరం సంజీవరెడ్డిని అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, కూటమి నాయకులు,కార్యకర్తలు, ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు.స్థానిక ఎంపీడీవో సభా భవనంలో జరిగిన ఈ ఎన్నికలో ఉప మండలాధ్యక్షుడిగా పార్నపల్లె ఎంపీటీసీ ముక్కోళ్ల రమేష్ను ఎన్నుకున్నారు. ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి, తాసిల్దార్ రామచంద్రుడు, ఎంపీటీసీలు, మండల పరిధిలోని కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

నామినేషన్ల ప్రక్రియను నిబంధనల మేరకు పకడ్బందీగా నిర్వహించాలి

- నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి

కర్నూలు నవంబర్ 19(నేటి మినిట్ టు మినిట్): రెండవ దశ గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను ఎన్నికల కమిషన్ నిబంధనలు, మార్గదర్శకాల ప్రకారం ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ ఏ. సిరి అధికారులను ఆదేశించారు.గురువారం ఓర్వకల్లు మండల కేంద్రంలోని స్వర్ణ గ్రామ పంచాయతీ కార్యాలయంలో కొనసాగుతున్న నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను జిల్లా కలెక్టర్



ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నామినేషన్ల స్వీకరణకు చేసిన ఏర్పాట్లు, అభ్యర్థుల నుంచి నామినేషన్ పత్రాల స్వీకరణ, రికార్డుల నిర్వహణను పరిశీలించారు.నామినేషన్లు సమర్పించేందుకు వచ్చే అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించాలని, నామినేషన్ పత్రాలను నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించి స్వీకరించాలని సూచించారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటిస్తూ ప్రతి అంశాన్ని రికార్డుల్లో నమోదు చేయాలని, ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో కర్నూలు డివిజన్ ఆర్డీవో సందీప్ కుమార్, తహశీల్దార్ విద్యాసాగర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

బొమ్మనహాల్ ఎంపీపీగా పి.సోమనాథ్ ప్రమాణ స్వీకారం

ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు..16 మంది ఎంపీటీసీల ప్రమాణం

టీడీపీ శ్రేణుల భారీ సమీకరణ.. జెండాలు,నినాదాలతో హోరెత్తిన సభ

బొమ్మనహాల్ నవంబర్ 19(నేటి మినిట్ టు మినిట్): బొమ్మనహాల్ మండల పరిషత్ అధ్యక్షుడిగా (ఎంపీపీ) పి.సోమనాథ్ ప్రమాణ స్వీకారం చేశారు,బండూరు గ్రామ ఎంపీటీసీ టీ. ప్రవల్లిక వైస్ ఎంపీపీగా బాధ్యతలు స్వీకరించారు,ఈ కార్యక్రమానికి రాయదుర్గం ఎమ్మెల్యే,ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు ముఖ్య అతిథిగా హాజరై నూతన ఎంపీపీ,వైస్ ఎంపీపీతో పాటు ఎంపీటీసీలకు అభినందనలు తెలిపారు.ప్రమాణ స్వీకార కార్యక్రమానికి టీడీపీ నాయకులు,కార్యకర్తలు, మహిళలు భారీగా తరలిరావడంతో సభ ప్రాంగణం పార్టీ జెండాలు,నినాదాలతో సందడిగా మారింది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ..తెలుగుదేశం పార్టీ బీసీలు, బడుగు బలహీన వర్గాలకు అండగా నిలిచే పార్టీ అని పేర్కొన్నారు.పార్టీకి నాయకత్వం కంటే కార్యకర్తల కష్టమే అసలైన బలమని అన్నారు.బొమ్మనహాల్ మండలంలో పార్టీని మరింత బలోపేతం చేయడంలో ఎంపీపీ పి. సోమనాథ్ సమర్థవంతంగా పనిచేస్తారనే నమ్మకం ఉందన్నారు,గ్రామస్థాయి నుంచి పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రతి కార్యకర్తను కలుపుకొని ముందుకు సాగాలని సూచించారు.నూతన ఎంపీపీ పి.సోమనాథ్ మాట్లాడుతూ..ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందన్నారు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సహకారంతో ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. బొమ్మనహాల్ మండల ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా నాయకులు,కార్యకర్తలు కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు,పార్టీ కోసం అహర్నిశలు శ్రమించిన నాయకులు,కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలుపుతూ రాబోయే రోజుల్లో పార్టీ మరింత బలోపేతానికి





అందరూ ఐక్యంగా పనిచేయాలని ఆకాంక్షించారు.నూతనంగా ఎన్నికైన 16 మంది ఎంపీటీసీలలో కొత్తపల్లి బాబురావు,కురుబ గంగమ్మ, ఎం.భాగ్యమ్మ,లలిత,టీ. ప్రవల్లిక,సింధవళ్లం ధర్మన్న గౌడ్, గొల్ల తిప్పేస్వామి,సరోజమ్మ, యగ్గడి ఆనంద్, వి.ఎల్.దినేష్ బాబు గోవింద,వడ్డే మాలతి, బోయ సుశీలమ్మ,గుర్రం రజిని కుమారి,దేవ దిలీప్ కుమార్, సోమనాథ్ ప్రమాణ స్వీకారం చేశారు.ఈ కార్యక్రమంలో ఎన్నికల అధికారి గోపాల్ నాయక్, ఎంపీడీవో విజయభాస్కర్, మండల సీనియర్ నాయకులు తిమ్మరాజు,కొత్తపల్లి మల్లికార్జున జెడ్పీటీసీ కొత్తపల్లి మహేంద్ర, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ హనుమంత రెడ్డి,మాజీ మార్కెట్ యార్డ్ చంద్రహాస్,మండల కన్వీనర్ మల్లన్న,మాజీ ఎంపీపీ ముల్లంగి నారాయణస్వామి, మాజీ మండల కన్వీనర్ బలరాం రెడ్డి,గొనేహాల్ కేశవరెడ్డి,తదితర నాయకులు,అభిమానులు, కార్యకర్తలు,యువ నాయకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

M/S SUNIL PUBLICATIONSPrinting Press (Name & Address)PrinterM/S SUNIL PUBLICATIONS D.NO.: 28-5-782, HOUSING BOARD COLONY, REVENUE WARD NO. 28, ANANTAPUR., ANDHRA PRADESH - 515001.